సాక్షి
కాకినాడ
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం సోమిశెట్టి సందీప్, కుటుంబ సభ్యులు (సఖినేటి పల్లి) రూ.50,116 విరాళం అందజేశారు.



పచ్చదనానికి పురస్కారం

పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా వాటికి నగదు పురస్కారాలను అందజేయనుంది.

నన్ను క్షమించండి..

మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అతడు కష్టపడి ఉన్నత చదువులు చదివాడు. అధ్యాపకుడిగా జీవితంలో స్థిరపడ్డాడు. అయితే కుటుంబ కలహాలు, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసుల చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



8లో

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.36 లక్షలు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.2,36,023 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 3500 మంది భక్తులకు ప్రసాద వితరణ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

విశ్రాంతి షెడ్డుకు 3న శంకుస్థాపన



విశ్రాంతి షెడ్డు నిర్మించనున్న స్థలం

అన్నవరం: స్వామివారి దేవస్థానంలో పశ్చిమ రాజగోపురం ముందు గల ఖాళీ ప్రదేశంలో విశ్రాంతి షెడ్ నిర్మాణానికి వచ్చేనెల మూడో తేదీ ఉదయం 10.52 గంటలకు 'లారెస్' సంస్థ యాజమాన్యం శంకుస్థాపన చేయనున్నట్లు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు శనివారం తెలిపారు. ఆ స్థలాన్ని దేవస్థానం ఈఈ రామకృష్ణ ఆధ్వర్యంలో చదును చేయించి సిద్ధం చేసినట్లు ఈఓ తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇక్కడ వంద అడుగుల వెడల్పు, 125 అడుగుల పొడవుతో విశ్రాంతి షెడ్డు నిర్మించనుంది. సుమారు రూ.1.5 కోట్లు వ్యయంతో 12,500 చదరపు అడుగుల స్థలంలో టెన్సిల్ షెడ్డు (తెలుపు ప్లాస్టిక్ క్లాత్ తరహా షెడ్డు) నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

గణపతికి 108 వంటకాల నివేదన



తాళ్లపూడి: వినాయక చవితి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన గణపతికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రక్కిలంక గ్రామంలోని కాపుల వీధిలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకునికి శనివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల వంటకాలతో నివేదించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.



పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు



జ్వరాలు వైరల్!

- ప్రతి ఇంటా జ్వర బాధితులే
- దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో సతమతం
- వస్తే తగ్గడానికి వారం రోజుల సమయం
- ప్రతి ఒక్కరికీ రూ.6 వేలకు పైగా ఖర్చు
- ప్లేట్‌లెట్లు పడిపోతే రూ.50వేల నుంచి రూ.70 వేల వ్యయం
- జ్వరాలకు వర్తించని ఆరోగ్యశ్రీ
- అప్పులు చేసి బిల్లులు కడుతున్న రోగులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పట్టణాలు పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. ఒక పక్క జ్వరాల సీజన్ కాగా మరో పక్క దోమల దండయాత్రతో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. దీంతో ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతున్నాయి. మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు పోరాడుతున్నారు. అయితే అధికారులు మాత్రం అరకొర నివారణ చర్యలు తీసుకుని చేతులు దులుపుకొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అనేక ప్రాంతాల్లో దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో దోమల కార్ఖానాలు జిల్లా వ్యాప్తంగా ఎక్కువైపోయాయి. జిల్లాలో 22 లక్షల జనాభా ఉండగా, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 62 ఆరోగ్య సచివాలయాలు, 40 సామూహిక ఆరోగ్య కేంద్రాలు, 23 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వంద మంది వైద్యులు, 1049 మంది పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు.

దోమల నియంత్రణకు అధికారులు అరకొరగానే చర్యలు చేపడుతున్నారు. ఒకపక్క వర్షాలు కురిస్తే ఇంటి ఆవరణలోనే పూల కుండీలు, నీటి ట్యాంకులు ఇంటిపై ఉన్న ఖాళీ స్థలాలలో నీరు ఎక్కువగా నిలబడి దోమలు విజృంభిస్తున్నాయి. వీధులు, కాలనీలు, శివారు ప్రాంతాలనే తేడా లేకుండా దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో పలు గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం చాలా అధ్వానంగా తయారైంది. దీంతో జ్వరాల బాధితులు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లో సరిపడినన్ని నిధులు లేకపోవడంతో గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు కాలువలు కూడా శుభ్రం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. బ్లీచింగ్ ముగ్గు, ఫినాయిల్ వంటి పిచికారీ చేయాలంటే డబ్బులు అవసరం కాగా పంచాయతీల ఖజానాలు దాదాపు ఖాళీ అయిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రావలసి ఉన్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించి రోజురోజుకూ దోమలు పెరిగిపోవడం వల్ల ప్రజలు రోగాలను బారిన పడుతున్నారు.

రోగులతో కిటకిటలాడుతున్న పీహెచ్‌సీలు

కాకినాడ జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలకు ప్రతి నిత్యం 30 నుంచి 40 మంది జ్వరం బాధితులు వస్తున్నారు. కరప మండలంలోని కరప, వేళంగి పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిత్యం 60 నుంచి 70 మంది జ్వరం, తదితర వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. పిఠాపురం మండలం చేబ్రోలు పీహెచ్‌సీలో ప్రతిరోజు 70 నుంచి 100 మందికి పైగా జ్వరం బారిన పడినవారు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. పెద్దాపురం మండలం పులిమేరు, కాండ్రకోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో 70 నుంచి 80 మంది ప్రతి రోజు జ్వరం బాధితులు వైద్యానికి వస్తున్నారు. ఇక కాకినాడ జీజీహెచ్‌కు నిత్యం 500 మందికి తక్కువ కాకుండా జ్వరం బాధితులు వస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిలువు దోపిడీ

జ్వరం వచ్చిందని ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే రూ.5 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నారు. రక్త పరీక్షలు, సెలైన్ పెట్టి రూ.6 వేలకు తక్కువ కాకుండా బిల్లు చేతిలో పెడుతున్నారు. దీంతో రోగులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రోగికి కానీ డెంగీ, మలేరియా వచ్చి ప్లేట్‌లెట్లు గానీ పడిపోతే రూ.50 వేల నుంచి రూ.60 వేలు గుంజేస్తున్నారు. ఈ బిల్లులు చెల్లించలేక సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు వారు అప్పుల పాలవుతున్నారు.

డెంగీ రావడంతో రూ.70 వేల బిల్లు కట్టా

నాకు ఇటీవల డెంగీ జ్వరం రావడంతో పిఠాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాను. వారు రూ.80 వేల బిల్లు వేశారు. అంత కట్టలేనని చెప్పడంతో రూ.10 వేలు తగ్గించారు. విధిలేక ఆ మొత్తాన్ని చెల్లించి బయటకు రావాల్సి వచ్చింది. ఐదు రోజులు ఆసుపత్రిలో ఉన్నదానికి ఇంత పెద్ద మొత్తం డబ్బులు చెల్లించాలంటే చాలా ఇబ్బంది పడ్డాను.

– మేడిశెట్టి దొరబాబు, కొండెవరం, యుకొత్తపల్లి మండలం.

డబ్బులు కడితేనే వైద్యం

జ్వరం వచ్చి ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే అక్కడ ప్లేట్‌లెట్లు పడిపోయాయని రోగులను భయపెట్టి మరీ డబ్బులు గుంజేస్తున్నారు. పోనీ దీనికి ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య చేయాలన్నా ఆయా ప్రైవేట్ ఆసుపత్రులలోని సిబ్బంది ఆరోగ్యశ్రీ దీనికి వర్తించదని డబ్బులు కడితేనే వైద్యం చేస్తామని ఇబ్బంది పెడుతున్నారు. రోగులు అప్పులు చేసి మరీ ఆసుపత్రులు బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

అరకొరగానే అవగాహన కార్యక్రమాలు

జ్వరాల సీజన్ వచ్చినా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో రోగులు భయపడి ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి దోమల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అటువంటివేవీ సక్రమంగా జరగడం లేదు. పట్టణ గ్రామీణ ప్రజలు ప్రజలకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఒకపక్క మలేరియా మరో పక్క డెంగీ కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి.

గోదావరి ఉరకలు

- ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- అప్రమత్తమైన ఇరిగేషన్ యంత్రాంగం



వరద ఉధృతితో కాటన్ బ్యారేజీ వద్ద ఒడ్డుకు చేరిన పడవలు

ధవళేశ్వరం: ఎగువ నుంచి వస్తున్న వరదతో గోదావరి ఉరకలెత్తుతోంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్దకు భారీగా నీరు చేరుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 175 గేట్లను పైకి లేపి మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉప నదులైన మంజీర, ఇంద్రావతి, శబరి పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని కిందకు వదులుతున్నారు. ఆ ప్రభావంతో కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి శనివారం క్రమేపీ పెరిగింది. ఉదయం 10.30 అడుగులు ఉన్న నీటి మట్టం రాత్రి 8.35 గంటలకు 11.75 అడుగులకు చేరింది. దీంతో ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో నీటి ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో ఆదివారం కూడా మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో గోదావరిలో పడవల రాకపోకలను నిషేధించారు. శనివారం రాత్రి 9 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.80 అడుగులకు చేరింది. 10,01,410 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 11,700 క్యూసెక్కులు విడిచిపెట్టారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 12.56, పేరూరులో 16.76, దుమ్ముగూడెంలో 12.90, కూనవరంలో 18.97, కుంటలో 10.20, పోలవరంలో 12.22, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి 15.85 మీటర్లు, భద్రాచలంలో 47.70 అడుగుల నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

ముగిసిన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పురుషుల విభాగం విజేత దుర్గా శివకుమార్, మహిళల విభాగం విజేత అఖిలదేవిలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్: స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. ఇందులో విజేతలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పోటీల్లో పురుషుల విభాగం విజేతగా కె.దుర్గా శివకుమార్ (కాకినాడ), రన్నర్‌గా కె.మోహన్ (కాకినాడ), మహిళల విభాగం విజేతగా డి.అఖిలదేవి (రామచంద్రపురం), రన్నర్‌గా వై.ఇందిర (అమలాపురం), స్ట్రాంగ్ మాస్టర్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), స్ట్రాంగ్ మాస్టర్ రన్నర్‌గా బి.అప్పన్న (అమలాపురం) టైటిల్స్‌ను గెలుచుకున్నారు. అలాగే మహిళల విభాగంలో 66 కేజీల కేటగిరీలో ఎస్.స్పందన (రాజోలు), 74 కేజీల కేటగిరీలో పి.దీవెన (కాకినాడ), 83 కేజీలో కేటగిరీలో డి.అఖిలదేవి (రామచంద్రపురం), బాలుర సబ్ జూనియర్ విభాగంలో 53 కేజీల కేటగిరీలో పి.వీరేంద్ర (కాకినాడ), 59 కేజీల కేటగిరీలో జె.జితేంద్రదొర (అమలాపురం), 66 కేజీల కేటగిరీలో కె.సాయి మణికంఠ (కాకినాడ), 74 కేజీల కేటగిరీలో ఎంఎస్ విన్ (జగ్గంపేట), మెన్ విభాగంలో 59 కేజీల కేటగిరీలో వై.రాజు (రాజమహేంద్రవరం), 66 కేజీల కేటగిరీలో ఎం.రాహుల్ బాబు (అమలాపురం), 74 కేజీల కేటగిరీలో కె.దుర్గా సాయికుమార్ (కాకినాడ), 83 కేజీల కేటగిరీలో కె.మోహన్ (కాకినాడ), 93 కేజీల కేటగిరీలో కె.సుధీర్ (మలికిపురం), 105 కేజీల కేటగిరీలో బి.అనూష్‌బాబు (మురమళ్ల), మాస్టర్స్ విభాగంలో 83 కేజీల కేటగిరీలో డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 93 కేజీల కేటగిరీలో బి.అప్పన్న (అమలాపురం) ప్రథమ స్థానాలు సాధించారు. విజేతలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకుడు మోకా వెంకట సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు ట్రోఫీలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, నగభేరి కృష్ణమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు కల్వకొలను బాబు, గొలకోటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు దాదాపు 200 మంది పవర్ లిఫ్టర్లు పాల్గొని బరువులెత్తి సత్తా చాటారు.

తిరుచ్చి వాహనంపై ఊరేగింపు



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అన్నవరం: రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని శనివారం తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పూజల అనంతరం అర్చకులు ఊరేగింపు ప్రారంభించారు. వేదపండితుల మంత్రాల నడుమ మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. తిరిగి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకుడు కంచిభట్ల రామ్‌కుమార్, వేదపండితులు వేదుల సూర్యనారాయణ, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, సంతోష్ పాల్గొన్నారు.

స్వామిని దర్శించిన 25 వేల మంది భక్తులు

శనివారం సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 1,200 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది భక్తులకు అన్నదాన పథకంలో భోజనం పెట్టారు.

నేడు టేకు రథంపై ఊరేగింపు

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను టేకు రథంపై ఆదివారం ఉదయం పది గంటలకు ఆలయప్రాకారంలో ఊరేగించనున్నారు. రూ.2,500 టిక్కెట్‌తో ఈ సేవలో పాల్గొనే నలుగురు భక్తులకు అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం, స్వామివారి కండువా, జాకెట్టుముక్క, ప్రసాదం అందజేస్తారు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

క్రమంగా పెరుగుతూ..



ముక్తేశ్వరం - అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద నీటిలో వెళ్తున్న ప్రజలు



ఐ.పోలవరం మండలం మురమళ్ల - అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టుల మధ్య వరద ఉధృతి

- మళ్లీ గోదావరికి వరద నీరు
- నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

ఐ.పోలవరం/ పి.గన్నవరం: వరద మళ్లీ పెరుగుతోంది.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరవళ్లు తొక్కుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున దిగువకు వస్తోంది.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం పెరిగిన వరద తరువాత సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. తిరిగి శనివారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. తెల్లవారుజామున మూడు గంటల నుంచి వరద క్రమేపీ పెరుగుతోంది. మూడు గంటలకు బ్యారేజీ నుంచి దిగువకు 7,52,579 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇది ఉదయం ఆరు గంటల సమయానికి 7,93,608 క్యూసెక్కులకు, మధ్యాహ్నం 12 గంటలకు 8,60,262 క్యూసెక్కులకు, మూడు గంటలకు 8,98,113 క్యూసెక్కులకు, రాత్రి ఎనిమిది గంటలకు 9,75,286 క్యూసెక్కులకు చేరింది.

పడవలపైనే ప్రయాణం

జిల్లాలోని లంక గ్రామాలపై వరద ప్రభావం పడింది. పి.గన్నవరం మండల పరిధిలో జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేటలకు ఇప్పటికీ పడవలపై రాకపోకలు సాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా వరద పెరగడంతో మండలాన్ని ఆనుకుని పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయలంక కాజ్‌వే నీట మునిగింది. దీంతో ఇక్కడ పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగారి లంకలకు సైతం పడవలపై వెళ్తున్నారు. మరోసారి వరద పెరగడంతో ఇక్కడ లంక రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

లోతట్టు ప్రాంతాలను తాకుతూ..

ఐ.పోలవరం మండలం అన్నంపల్లి అక్విడెక్ట్‌ను ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మండలంలో మురమళ్ల, కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని పొగాకులంక, పల్లిపాలెం, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేల్లంక, గురజాపులంక, కూనాలంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు, బలుసుతిప్ప, అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం వంటి లోతట్టు ప్రాంతాలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగితే ఈ లంక గ్రామాల్లోకి వరద నీరు చేరే అవకాశముంది.

ప్రయాణం.. ప్రమాదం



ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం రేవులో లైఫ్ జాకెట్లు లేకుండా పడవపై ప్రయాణం

వరద ఉధృతి పెరుగుతున్న సమయంలో జిల్లాలోని పలు రేవుల వద్ద లైఫ్ జాకెట్లు లేకుండా పడవలపై ప్రయాణాలు సాగిస్తుండడం గమనార్హం. ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం రేవులో ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. కనీసం లైఫ్ జాకెట్లు కూడా ఉపయోగించకుండా ప్రయాణికులను రేవు దాటిస్తున్నారు. వరదల సమయంలో రేవు ప్రయాణాలపై అధికారులు నిఘా పెట్టాల్సి ఉన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రమాదం జరిగితేకాని అధికారులు స్పందించరా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

భజే విఘ్నేశ్వరా..



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి

అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి శనివారం లక్ష దూర్వార్చన పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం జరిపారు. స్వామివారికి పంచ హారతులు ఇచ్చారు. స్వామివారిని మూషిక వాహనంపై ఉంచి వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సుస్థిర లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: సుస్థిర లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) సీనియర్ ఫ్యాకల్టీలు కె.సునీల, ఎస్ఎస్ శర్మ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా మూడు రోజుల పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు టీఓటీలుగా నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. వారు మాట్లాడుతూ సుస్థిర లక్ష్యాలలో ముఖ్యమైన ఒకటి నుంచి ఎనిమిది అంశాలపై శిక్షణ ఇచ్చామని, వాటిని ఆయా గ్రామాల్లో అమలు జరిగే విధంగా చూడాలన్నారు. శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆయా జిల్లాలోని మండల పరిధిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫ్యాకల్టీలు ఎం.చక్రపాణిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి తెనాలికి లారీలో తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం కోరంగి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. యానాంలోని సర్వలక్ష్మి రైస్ ప్రొడక్షన్ మిల్లు నుంచి ఆంధ్రా ప్రాంతానికి బియ్యాన్ని తరలిస్తుండగా కోరంగి పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, తాళ్లరేవు డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, కోరంగి అడిషనల్ ఎస్సై సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనానికి పురస్కారం

- పాఠశాలలకు స్టార్ రేటింగ్
- కేంద్ర ప్రభుత్వ కొత్త పథకం
- జిల్లా నుంచి 8 పాఠశాలలకు అవకాశం
- జాతీయస్థాయికి ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం



ఉన్నత పాఠశాల

రాయవరం: మానవాళి మనుగడ సాగించేందుకు పచ్చదనం, పరిశుభ్రత అనేవి చాలా అవసరం. వీటిని ఎవరికి వారు కాపాడుకుంటూ భావితరాలకు అందజేయాలి. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. మొక్కలను పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. అలాగే పరిశుభ్రత కారణంగా అనేక వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ఈ రెండింటినీ పాఠశాల స్థాయి నుంచి అభివృద్ధి చేయాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది. దీనిలో భాగంగా పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్య ఇచ్చే పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనుంది. మెరుగైన పనితీరు కనబరిచిన పాఠశాలకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తుంది.

ఐదు స్టార్ల కేటాయింపు

కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌లో మార్పులు చేసి ఇప్పుడు స్వచ్ఛ ఏవమ్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) 2025–26 పేరిట బడులకు రేటింగ్ ఇవ్వనుంది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారంతో పాటు రూ.లక్ష ప్రోత్సాహకం అందించనుంది. మొత్తం ఆరు ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా ఒకటి నుంచి ఐదు స్టార్లు కేటాయించనున్నారు. ప్రతి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేస్తారు.

ఆరు అంశాలు.. 60 సూచికలు

ఆరు అంశాల ఆధారంగా పాఠశాలలకు రేటింగ్ ఇస్తారు. పాఠశాలలో నీటి సదుపాయం, వాన నీటి సంరక్షణ, వినియోగం, మరుగుదొడ్డి సౌకర్యాలు, విద్యార్థులకు సబ్బుతో హ్యాండ్ వాష్, వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, విద్యుత్ సదుపాయం, బిహేవియర్ ఛేంజింగ్, కెపాసిటీ నిర్మాణం, మిషన్ లైఫ్ యాక్టివిటీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు.

జిల్లాలో 2,031 పాఠశాలలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో వివిధ కేటగిరిలకు చెందిన 2,031 పాఠశాలలున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 10వ తేదీ లోపు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి. ప్రతి సూచికకు సంబంధించిన ఆధారాలు అప్‌లోడ్ చేయాలి. పరిశీలకులు స్వయంగా పరిశీలించి ఒకటి నుంచి ఐదు వరకు రేటింగ్ ఇస్తారు. ఉత్తమ స్కోర్ సాధించిన బడులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు ఇస్తారు. ఒక్కో జిల్లా నుంచి 8 పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో గరిష్ఠంగా 20 పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. వాటిని జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందజేస్తారు. సంబంధిత హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు దేశంలోని ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తారు.

ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఆరు అంశాల ప్రాతిపదికగా దరఖాస్తు చేసుకోవాలి. స్వచ్ఛ విద్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి.
– బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఎంవో, సమగ్ర శిక్షా, అమలాపురం

అవగాహన కల్పించాం



స్వచ్ఛ ఏవమ్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) 2025–26కు ప్రతి పాఠశాల అర్హత సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. దీనిపై ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాం. మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షణ చేసి, ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలి.
– జి.మమ్మీ, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కళ్లలో కారం కొట్టి బంగారం గొలుసు చోరీ



సత్యనారాయణరాజు దంపతులు

ఐ.పోలవరం: ఇంట్లో టీవీ చూస్తున్న మహిళ కళ్లలో కారం కొట్టి, నాలుగు కాసుల బంగారం గొలుసును దొంగలు దోచుకుపోయారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవీ.. ఐ. పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన గాదిరాజు సత్యనారాయణ రాజు, కృష్ణవేణి భార్యాభర్తలు. శుక్రవారం రాత్రి సత్యనారాయణరాజు గదిలో నిద్రిస్తుండగా, ఆయన భార్య కృష్ణవేణి హాల్లో టీవీ చూస్తున్నారు. ఆ సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి.. కృష్ణవేణి కళ్లలో కారం కొట్టారు. ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసును లాక్కుని పోయారు. ఆమె తేరుకుని కేకలు వేసేటప్పటికే మోటారు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి వెళ్లి వస్తుండగా..


పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి కాలినడకన వస్తున్న మహిళను బెదిరించి, ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసును దొంగ లాక్కుని పరారయ్యాడు. పెద్దాపురం మండలం చదలాడ–ఉలిమేశ్వరం గ్రామాల మధ్య శనివారం ఈ ఘటన జరిగింది. కాండ్రకోటకు చెందిన ఒబిలిశెట్టి అమ్మల అనే మహిళ వేకువ జామున కాలి నడకన స్వామివారి గుడికి వస్తోంది. మార్గంమధ్యలో ఉలిమేశ్వరం – చదలాడ గ్రామాల మధ్యలో ఉన్న పామాయిల్ తోట వద్ద గుర్తు తెలియని యువకుడు ఆమెను బెదిరించి, బంగారం గొలుసు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు.

నన్ను క్షమించండి..

- వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి జేఎన్‌టీయూకే అధ్యాపకుడి ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం
- భార్య, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసులు చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం



మట్ల శ్రీనివాస్ (ఫైల్)



క్షమించండి అంటూ వాట్సాప్ స్టేటస్‌లో శ్రీనివాస్ పెట్టిన సందేశం

తొండంగి: మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అతడు కష్టపడి ఉన్నత చదువులు చదివాడు. అధ్యాపకుడిగా జీవితంలో స్థిరపడ్డాడు. అయితే కుటుంబ కలహాలు, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసుల చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తొండంగి మండలం రావికంపాడుకు చెందిన మట్ల గంగారావు, గంగమ్మ దంపతుల కుమారుడు మట్ల శ్రీనివాస్ (35) జేఎన్‌టీయూకేలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా 13 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అతడికి సుమారు 12 ఏళ్ల క్రితం వివాహం కాగా, భార్య దివ్యతో కలిసి కాకినాడలో నివాసం ఉంటున్నాడు. వీరికి గంగ సాన్విత, సాయి గంగాధర అవినాష్ అనే పిల్లలు ఉన్నారు. కాగా.. కొంత కాలంగా శ్రీనివాస్‌కు అతడి భార్యతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె తన బంధువులైన కూటమి నేతల ఒత్తిడితో నాలుగు రోజుల క్రితం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శ్రీనివాస్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మనస్తాపంతో..

ఈ ఘటనతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ శుక్రవారం తన స్వగ్రామమైన రావికంపాడుకు వచ్చాడు. తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం బయటకు వచ్చి స్థానిక రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా తన ఆత్మహత్యకు వీరే కారణమంటూ కొందరి పేర్లను ప్రస్తావించాడు. అలాగే నన్ను క్షమించండి అంటూ పిల్లల పేర్లు, అమ్మ నాన్న అని టైప్ చేసి వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో సంచలనమైంది. కాగా.. రైల్వేట్రాక్‌పై శ్రీనివాస్ మృతదేహాన్ని శనివారం గుర్తించామని, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి తండ్రి గంగారావు వికలాంగుడు, తల్లి కీళ్ల వ్యాధితో నడవలేని స్థితిలో ఉంది. ఈ పరిస్థితిలో కుమారుడిని కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

దొంగల ముఠా అరెస్ట్



ట్రక్కుల దొంగలను విలేకరులకు చూపుతున్న పోలీసులు

గండేపల్లి: ట్రాక్టర్ ట్రక్కులను చోరీ చేస్తున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం ఆ వివరాలు వెల్లడించారు. ధవళేశ్వరం సమీపంలోని రాజవోలుకు చెందిన బి రత్నరాజు, కడియం మండలం జేగురుపాడుకు చెందిన ఎం శ్రీను, పి.తరుణ్, ఎం.వినయ్ కుమార్ ట్రాక్టర్ (ఇంజిన్)ను తీసుకుని వచ్చి రైతుల పొలాల వద్ద ఉంచిన ట్రక్కులను దొంగిలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తాళ్లూరులో ట్రక్కును చోరీ చేస్తుండగా ఎస్సై యూవీ శివ నాగబాబు తన సిబ్బందితో దాడి చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి నేరాలకు ఉపయోగించే ట్రాక్టర్ (ఇంజిన్), మోటార్ సైకిల్, రూ. 5 లక్షల విలువైన ట్రక్కులు, రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టుకు తరలించగా సెప్టెంబర్ 12 వరకు రిమాండ్ విధించారన్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు, మురారి, అనకాపల్లి జిల్లా నాతవరం, తూర్పుగోదావరి జిల్లా సమిశ్రగూడెంలో ట్రక్కులను వీరు దొంగిలించారు.

తండ్రిపై బీరు బాటిల్‌తో దాడి

నల్లజర్ల: మండల పరిధిలోని అనంతపల్లి శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన కాకి సుబ్బారావు ఇటుకల వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు శనివారం సాయంత్రం మద్యం కోసం దుకాణం వద్దకు వెళ్లగా అక్కడ స్నేహితులతో కలసి మద్యం సేవిస్తున్న తన కొడుకును మందలించాడు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన కొడుకు తండ్రిని బీరుబాటిల్‌తో దాడి చేసి మెడమీద పొడిచాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ సుబ్బారావును రాజమండ్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ DIPLOMA & ENGINEERING Admisions Reg.by All Governments. SRM College. Phone : 94401 11487. [P-319]

DISTANCE EDUCATION

■ ఓపెన్ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్శిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్ : 82975 92043, 99494 82757 [V- 2852]

Real Estate

FOR SALE

■ BSNL POSTAL HOUSING SOCIETY Residential and Commercial Sites near Bengaluru International Airport. Rs:1400/- per sqft Bang on 8 Lane (330 feet Ring road) Booking Open for General public Call: 90715 34000 [QA-2295]

LAND FOR SALE

■ మెగా అవకాడో ఫామ్‌ల్యాండ్ ఎకరం తీసుకున్న వారికి గజం 799/- మాత్రమే. 5 నుండి 60వ సంవత్సరం వరకు ఏటా 10 నుండి 15లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. Ph:9133574455 [HA-4278]

■ నివాస స్థలం అమ్మబడును రాజానగరం –కాకినాడకి వేళ్ళే ప్రధాన రహదారి నుండి కేవలం 150 మీటర్లు దూరంలో వడిసలేరు గ్రామ పరిధిలో 728 చదరపు గజాలు (15 సెంట్లు) అమ్మబడును. ఆసక్తిగల వారు దిగువ నంబర్‌ను సంప్రదించండి. 9113842185 L [HA-14874]

HOUSE FOR SALE

■ రాజమండ్రి H.B. కాలనీ ఎదురుగా, ఫారెస్ట్ ఆఫీస్ ప్రక్కన, 3BHK, 2 హాల్స్ డూప్లెక్స్ విల్లా అమ్మకం. కొంతమూరు ప్రాంతం ఎంప్లాయిస్ కాలనీలో (8Yrs old) S/F. 137 చ॥గ॥ల్లో ఇండివిడ్యువల్‌హౌస్ అమ్మకం. ఫోన్: 94944 88294. నో బ్రోకర్స్. H [V-2845]

PLOT FOR SALE

■ రాజమండ్రి, నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర North ఫేసింగ్ 500 Sq. yards అమ్మకమునకు కలదు. Contact : Phone / WhatsApp- 80748 57055 [R-1109]

■ కాకినాడ రూరల్, పిఠాపురం దగ్గర గల చిత్రాడ నుండి చంద్రంపాలెం వెళ్లే రోడ్డు పక్కన ప్లాట్లు మరియు కాకినాడ దగ్గర గల వాకలపూడి శ్రీనివాస్‌నగర్‌లో 300 గజాలు & కాకినాడ ADB రోడ్ దగ్గరలో అచ్చంపేట గ్రామం నుండి గొంచాల మీదుగా సామర్లకోట వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కన ప్లాట్లు అమ్మకమునకు కలవు. ఫోన్ : 94921 23355 [V- 2858]

TO-LET

■ కాకినాడ నాగమల్లితోట ఇండస్ట్రియల్ ఏరియా, రైస్‌మిల్ రోడ్‌లో వాటర్‌ప్లాంట్ ప్రక్కన 800 చ॥గ॥ స్థలంలో నిర్మించిన 3 షెడ్లు అద్దెకు కలవు. గొడౌన్స్, హోటల్స్, కారు రిపేరు సర్వీస్‌కు ఉపయోగం. ✆ : 97005 56669 [R-254]

■ Shop అద్దెకు, సర్పవరం జంక్షన్ దగ్గర, Fish Market ఎదురుగా, Call : 97045 65923, 94907 41763 [SCA25007686]

Services

BUSINESS OFFER

■ PM సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్స్‌ను మార్కెటింగ్ చేయుటకు జిల్లాలో మండలాలవారీగా ఏజెంట్స్ (P/F) మరియు డీలర్స్(ఫుల్ టైం)కు ఆహ్వానం వివరాలకు సంప్ర:సెల్:7270556650 [SCA25007668]

GOLD FINANCE

■ GK Gold లోన్స్:- బ్యాంకు/ప్రైవేట్ తనఖాలో వున్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును. లేదా అధిక ఋణం ఇప్పించబడును. ఫోన్ : 88977 31257 [SCA25007728]

Wanted

■ KKD గైగోలపాడు లేడీ టైలరింగ్ వర్క్ చేయుటకు M/F కావలెను. టైలరింగ్, మగ్గం, ఎంబ్రోయిడ్ & హ్యాండ్ వర్క్ నేర్పబడును కుట్టబడును. ✆ : 97047 44774 [SCA25007605]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1272875]

■ ప్రముఖ కార్పొరేట్ కంపెనీ వారి ఉద్యోగ అవకాశం. చీఫ్ మేనేజర్స్ (10 Nos) 40+M/F కావలెను. Govt/Private & Rtrd/VRS కూడా అర్హులు. SPL ప్యాకేజీ కలదు. ✆ : 94907 45099 [R-7706]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూమ్+భోజనం.Hyd. 7993583999 [HA-16136]

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ కేర్ టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 89851 14453, 93910 36931 [HA-16135]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.